సకల హంగులతో సర్కారు కళాశాల

నాడు ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే జూనియర్ కళాశాలను నిర్వహించేవారు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడేవారు. ఆ ప్రభావం అడ్మిషన్లపై పడింది. చాలీచాలని గదులు, పూర్తి స్థాయిలో లెక్చరర్లు లేక విద్యార్థులు ఆసక్తి చూపేవారు కాదు.. ఈ ప్రాంతానికి దూరంగా ఉన్న పరవాడ, గాజువాకలో ఉన్న ప్రైవేట్ కళాశాలలకు వెళ్లేవారు. తమకు సమీపంలో కళాశాల ఎప్పుడు నిర్మిస్తారా అని ఎదురు చూసేవారు.

నేడు ఇప్పుడు ఇస్లాంపేటలో కొత్తగా జూనియర్ కళాశాల నిర్మించారు. 16 గదులతో ఆధునిక సదుపాయాలతో నూతన భవనం నిర్మించారు. పది మంది లెక్చరర్లను నియమించారు. దీంతో ఈ కళాశాలకు డిమాండ్ పెరిగింది. ఇక్కడ చదువుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. వారికి దూరాభారం, తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గాయి.



77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేటలో నిర్మించిన జూనియర్ కళాశాల భవనం



తరగతి గదిలో విద్యార్థులు

- ఇస్లాంపేటలో జూనియర్ కళాశాల నిర్మాణం
- రూ.2.18 కోట్లతో ఆధునిక వసతులు
- తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలలో బోధన
- విద్యార్థుల హర్షాతిరేకాలు



పెదగంట్యాడ: పేద విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో విద్యనందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి వసతులతో జూనియర్ కళాశాలను అందుబాటులోకి తేవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతకు ముందు హైస్కూల్‌లోనే అరకొర వసతుల మధ్య చదువుకునే విద్యార్థులు నేడు పూర్తి స్థాయిలో కళాశాల నిర్మించి, అధ్యాపకులను నియమించడంతో చదువుపై దృష్టి సారిస్తున్నారు.

రూ.2.18 కోట్లతో..

జీవీఎంసీ 77వ వార్డు ఇస్లాంపేటలో రూ.2.18 కోట్లతో కొత్తగా నిర్మించిన జూనియర్ కళాశాల భవనంలో మొత్తం 16 గదులు ఏర్పాటు చేశారు. అందులో విద్యార్థుల కోసం ఐరన్, ఫైబర్ బెంచీలను ఏర్పాటు చేశారు. గ్రీన్ బోర్డులు అమర్చారు. గాలి, వెలుతురు వచ్చేలా విశాలమైన గదులు నిర్మించారు. విద్యార్థులకు టాయిలెట్స్ సిద్ధం చేశారు. ఈ భవనం అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంతంలో ఉన్న 32 గ్రామాలకు చెందిన విద్యార్థులకు దూరాభారం తగ్గింది. గతంలో భవనం లేకపోవడంతో ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే కళాశాలను నిర్వహించేవారు. ఆ భవనం సరిపోకపోవడంతో సీఈసీ, ఎంపీసీ గ్రూపులను మాత్రమే తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలో నిర్వహించేవారు. ఇప్పుడు ఈ భవనం అందుబాటులోకి రావడంతో మరిన్ని గ్రూపులను నిర్వహించేందుకు ఫ్యాకల్టీని నియమించారు. దీంతో పాటు మరో భవనాన్ని కూడా సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ కళాశాలలో 129 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో బాలురు 68 మంది ఉండగా బాలికలు 61 మంది ఉన్నారు.



తరగతి గదిలో కొత్తగా ఏర్పాటు చేసిన బెంచీలు

నిధులు రూ.2.18 కోట్లు

కల్పించిన వసతులు
- నూతన భవన సముదాయం
- 16 గదులు
- ఐరన్, ఫైబర్ బెంచీలు
- గ్రీన్ బోర్డులు
- టాయిలెట్ల నిర్మాణం



విశాలమైన వరండా

వసతులు బాగున్నాయి



కొత్త భవనంలో వసతులు బాగున్నాయి. తరగతి గదులు విశాలంగా ఉన్నాయి. లెక్చరర్లు పాఠాలు బాగా బోధిస్తున్నారు. పరీక్ష కేంద్రం కూడా ఈ కళాశాలకే కేటాయిస్తే పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

– ఎండీ సనోబాల్ సారా, ఎంపీసీ, ఇంటర్ సెకండ్ ఇయర్

ఫ్యాకల్టీ బాగుంది



మా కళాశాలలో కొత్తగా నియమించిన ఫ్యాకల్టీ బాగుంది. పాఠాలను అర్థమయ్యే విధంగా బోధిస్తున్నారు. ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేస్తున్నారు. దీంతో ఎప్పటికప్పుడు చదువుకుంటున్నాం. ఈ ఏడాది మంచి మార్కులతో పాసవుతామనే నమ్మకం ఏర్పడింది.

– మహ్మద్ సాజిద్, ఎంపీసీ, ఇంటర్ సెకండ్ ఇయర్

భయం పోయింది



పదో తరగతి తర్వాత కాలేజీకి వెళ్లాలంటే భయంగా ఉండేది. కానీ ఈ కాలేజీలో చేరిన తర్వాత నాకు భయం పోయింది. ఇక్కడ సౌకర్యాలు బాగున్నాయి. చదువు కూడా బాగుంది. ప్రైవేటు కళాశాలల కంటే ఇక్కడే బోధన బాగుంది.

– అన్సర్ వలీ, సీఈసీ, ఇంటర్ ఫస్టియర్

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ



కొత్తగా ఇక్కడ కళాశాల భవనం ప్రారంభించాం. పది మంది లెక్చరర్లను నియమించాం. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. ముఖ్యంగా ఇక్కడ ఉర్దూ మీడియంలో పాఠాలు చెబుతున్నాం. రాష్ట్రంలో ఇదే ఉర్దూ మీడియం కళాశాల ఇదే. ఈ ప్రాంతంలో ముస్లింలు ఎక్కువగా ఉండడంతో పాటు వారంతా దీనిని సద్వినియోగం చేసుకుంటున్నారు.

– ఎన్ బెన్నుస్వామి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇస్లాంపేట

క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు



వైవీ సుబ్బారెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్న ఉరుకూటి చందు, అప్పారావు

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఉరుకూటి చందు ఆ పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ మాడుగుల పరిశీలకుడు ఉరుకూటి అప్పారావుతో కలసి, విశాఖ రైల్వే స్టేషన్‌లో సుబ్బారెడ్డిని మంగళవారం కలిసి పుష్పగుచ్ఛాలను అందించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మహాదేవుడికి లక్ష బిల్వార్చన



శివాలయంలో బిల్వార్చన చేస్తున్న అర్చకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు శివాలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. కార్తీక అమావాస్య సందర్భంగా రుత్వికులు మహాశివుని లక్ష బిల్వ పత్రాలతో అర్చించారు. ఆలయం ఆవరణలో హోమం నిర్వహించారు. అంతకు ముందు ఉమా రామలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాప్‌లో యాచకురాలి మృతదేహం గుర్తింపు

అక్కిరెడ్డిపాలెం: కొత్త గాజువాక బస్ స్టాప్‌లో గుర్తు తెలియని బిచ్చగత్తె (60) మృత దేహాన్ని గుర్తించిన స్థానికులు గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రవికుమార్ యాచకురాలి మృతదేహాన్ని మానవతా శాంతి రథంలో కేజీహెచ్‌కు తరలించారు. ఆమె చామనఛాయలో ఉన్నారని, 5అడుగుల పొడవు ఉన్నారని పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు గాజువాక పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు.

రైల్వే వ్యాగన్ రిపేర్స్ వర్క్‌షాపు కార్మికుల నిరసన



ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతున్న జగ్గు నాయుడు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని వడ్లపూడి రైల్వే క్రాసింగ్ వద్ద గల రైల్వే వ్యాగన్ రిపేర్స్ వర్క్ షాపు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిటూ జిల్లా కమిటీ నాయకుడు ఎం.జగ్గు నాయుడు డిమాండ్ చేశారు. రైల్వే వ్యాగన్ రిపేర్స్ వర్క్ షాపు ఎదుట సిటూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు న్యాయపరంగా పరిష్కరించాలని కోరిన ఏడుగురు కార్మికులను అన్యాయంగా తొలగించారన్నారు. సిటూజిల్లా కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, రైల్వే వ్యాగన్ వర్క్ షాపు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాంబాబు, ఈస్ట్ కోస్టు రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

శ్రీవారి గరుడ వాహనానికి భక్తుల విరాళం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి మిందిగ్రామానికి చెందిన గుడివాడ లోకేష్, లలిత దంపతులు రూ.10,116 అందజేశారు. స్వామివారిని మంగళవారం దర్శించుకున్న వారు, ఆ మొత్తాన్ని నగదు రూపంలో ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు. ఆలయంలో గరుడ వాహనం నిమిత్తం వినియోగించాలని కోరారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి

- యలమంచిలి డిప్యూటీ డీఈవో అప్పారావు
- లంకెలపాలెం హైస్కూల్ సందర్శన



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

అగనంపూడి: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు అన్నారు. ఈ అంశంలో పాఠశాలల సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. రక్తహీనతతో బాధపడుతున్న బాలల వివరాలు అడిగి, వారికి ప్రభుత్వం అందిస్తున్న మందులు విధిగా తీసుకునేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. తరువాత రాగి మాల్ట్ రుచి చూశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడిన ఆయన ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల నిర్వాహణ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్–3కు చెందిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఉక్కు ఎల్‌డీసీ విభాగం వద్ద అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. బీఎఫ్–3లో గత పదేళ్లుగా 97 మంది కాంట్రాక్ట్ కార్మికులు మెకానికల్, ఎలక్ట్రికల్, క్లీనింగ్ పనులు చేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 31న పాత కాంట్రాక్ట్ పూర్తి అయి కొత్త కాంట్రాక్టర్‌కు పని అప్పగించారన్నారు. అయినప్పటికీ కొత్త కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదన్నారు. దీనివల్ల అప్పటి నుంచి వారికి ఉపాధి లేకుండా పోయిందన్నారు. వెంటనే పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీజీఎం (వర్క్స్) ఎస్.వి.స్వామికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు మంత్రి రవి, పి.వి.నగేష్, శ్రీనివాసరావు, బి.రమణ, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు సంస్కారం ముఖ్యం



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థులు చదువుతో పాటు సంస్కారం అలవరచుకోవాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. గాజువాకలో మంగళవారం నిర్వహించిన యాపిల్ ఐ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రమశిక్షణ, సమయపాలన, నియమ నిబద్ధత కలిగి ఉండాలన్నారు. కష్టపడి చదివే కంటే ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ మంచి చదువు ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో రెయిన్‌బో హాస్పిటల్ అధినేత డాక్టర్ కంచర్ల రమేష్, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, స్కూల్ చైర్మన్ తలశిల బలరామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

68వ వార్డులో 'వికసిత్ భారత్'

అక్కిరెడ్డిపాలెం: పేదలు, ఆదివాసీలు, గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ ఎదురుగా గల మైదానంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రప్రభుత్వం చేపట్టిన పథకాలు, ప్రణాళికలను వివరించారు. లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సింహాచలం, బీజేపీ మండల అధ్యక్షుడు అప్పలరాజు, వార్డు అధ్యక్షుడు అప్పారావు, అమ్మాజీ, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణపై కేంద్రం పునరాలోచించాలి

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేద్దామనుకునే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అవివేకమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. దీనిపై కేంద్రంలో బీజేపీ పెద్దలు పునరాలోచించాలన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో 1034వ రోజు, మంగళవారం పలు విభాగాల కార్మికులు పాల్గొన్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మహిళకు గాయాలు

కూర్మన్నపాలెం: వీధి కుక్కల దాడిలో ఓ మహిళ గాయాలపాలయ్యారు. వివరాలివి.. అప్పికొండ విశ్వబ్రాహ్మణవీధిలో కె.లక్ష్మి(36) కుటుంబంతో నివాసముంటున్నారు. మంగళవారం తాను పెంచుకుంటున్న పెంపుడు కుక్కపై వీధి కుక్కల గుంపు దాడి చేస్తుండడంతో లక్ష్మి అడ్డుకునేందుకు ప్రయత్నించింది. దీంతో తిరగబడిన వీధి కుక్కలు లక్ష్మిపై దాడి చేసి, పాదాలను తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే ఆమెకు కణితి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం ర్యాబిస్ వ్యాక్సిన్ కోసం అగనంపూడి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. తరచూ కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు



66వ వార్డు అజీమాబాద్ సచివాలయంలో డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ ఇమ్రాన్



76వ వార్డులో డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న నాయకులు



88వ వార్డులో బుక్‌లెట్స్ ఆవిష్కరిస్తున్న బొడ్డ గోవింద్, వాడపల్లి రామచంద్రరాజు

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యం అని 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ అన్నారు. ఆయన పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యం కల్పించారన్నారు. అందుకే జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా అజీమాబాద్ సచివాలయ పరిధిలో ప్రజలకు వర్తించిన సంక్షేమ పథకాలు తెలియజేసే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఎస్ఎండీ గౌస్, క్లస్టర్ ఇన్‌చార్జి రాజాన వెంకటరావు, ఏపీజీబీ డైరెక్టర్ అలియ సురని, వార్డు అధ్యక్షుడు పెదిరెడ్ల ఈశ్వరరావు, చోటు భాయ్, మదీనా, రెడ్డి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

76వ వార్డు హెచ్‌బీ కాలనీలో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీ సచివాలయం–1 పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు దొడ్డి రమణ వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ పరిధిలో ప్రజలకు 30 కోట్ల 35 లక్షల 98 వేల 735 రూపాయలతో వర్తించిన సంక్షేమ పథకాలను వివరించే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో సీవో సూర్యనారాయణ, పరాంకుశం ప్రమీల, నరసింహమూర్తి పాల్గొన్నారు.

67వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: సీఎం జగన్‌తోనే రాష్ట్రానికి సంక్షేమ పాలన అందుతుందని డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి అన్నారు. 67వ వార్డులో మంగళవారం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సంక్షేమ పథకాలు తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో జెడ్పీ పి.సింహాచలం, నాయకులు పల్లా పెంటారావు, సూర్యనారాయణ, అన్నపూర్ణ, మీరాబాయి, కామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

88వ వార్డులో..

అగనంపూడి: ముఖ్యమంత్రిగా జగన్ మళ్లీ ఎన్నికైతేనే రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగుతుందని ప్రజలు నమ్ముతున్నారని వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, జేసీఎస్ మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు అన్నారు. 88వ వార్డు దువ్వాడ సెక్టార్–1లో నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాలను తెలియజేసే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. నాయకులు చిత్రాడ వెంకటరమణ, మడక నరసింగరావు, పత్తి లక్ష్మి, నాయుడు, లక్ష్మణరావు, లాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోలి పాడ్యమికి కోనేరు ముస్తాబు



విద్యుత్ కాంతుల్లో విజయరాజ స్వామి కోనేరు

అక్కిరెడ్డిపాలెం: పోలి పాడ్యమిని పురస్కరించుకుని 69వ వార్డు విజయరాజ స్వామి కోనేరును విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. కార్తీకమాసం పూర్తయిన సందర్భంగా భక్తులు బుధవారం కోనేరులో దీపాలను వదులుతారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి మంగళవారం శానిటరీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బందితో కోనేరు పరిసరాలను శుభ్రం చేయించారు.

రోజు విడిచి రోజు నీరు సరఫరా

పెదగంట్యాడ: ఏలేరు కాలువ మరమ్మతుల కారణంగా జీవీఎంసీ జోన్–6 పరిధిలో ఈ నెల 17వ తేదీ వరకు రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయనున్నామని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఎస్ఈ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని కొంగపాలెం, వెంకన్నపాలెం, గొడ్డువానిపాలెం, సత్యనారాయణపురం, భానోజీకాలనీ, భానోజీతోట, సంజీవిగిరి కాలనీ, వాంబే కాలనీ, బాపూజీ కాలనీ, నేతాజీ కాలనీ, ప్రియదర్శినీ కాలనీ, గిరిజా కాలనీ, దయాల్‌నగర్, నెహ్రూ నగర్, సింహగిరి కాలనీ, సిద్దేశ్వరం, టీజీఆర్ నగర్, అంబేద్కర్ కాలనీ, వినాయకనగర్, నడుపూరు, హెచ్‌బీ కాలనీ, డెయిరీ కాలనీ, గాంధీనగర్ ప్రాంతాల్లో రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. సమతానగర్, సనత్‌నగర్, స్వతంత్రనగర్, శ్రీనగర్, శ్రీరామ్‌నగర్, సుందరయ్య కాలనీ, అఫీషియల్ కాలనీ, విశ్వేశ్వరాయ నగర్, శ్రీనివాస్ నగర్, శ్రామికనగర్, డ్రైవర్స్ కాలనీ, ఎల్‌బీఎస్ నగర్, పాత గాజువాక, చిట్టినాయుడు కాలనీ, దశమికొండ, చినగంట్యాడ, చైతన్యనగర్ తదితర ప్రాంతాల్లోనూ రోజు విడిచి రోజు సరఫరా చేస్తామని తెలియజేశారు.

కబడ్డీ విజేతలు గంగవరం, ఉక్కునగరం జట్లు



గంగవరం జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న సీజీఎం, సీఐ, నాయకులు

ఉక్కునగరం: జిల్లాస్థాయి కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉక్కునగరం కబడ్డీ క్లబ్ రెండో వార్షికోత్సవం సందర్భంగా జిల్లా కబడ్డీ సంఘం పర్యవేక్షణలో ఉక్కునగరం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో 28 జట్లు పాల్గొన్నాయి. మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో పురుషుల విభాగం నుంచి ప్రథమ స్థానంలో నిలిచిన గంగవరం లైన్ స్టార్‌కు రూ. 20 వేలు నగదు ట్రోఫీ, రెండోస్థానం గెలుచుకున్న పెదగంట్యాడ మొల్లివానిపాలెం జట్టుకు రూ. 15 వేలు నగదు, ట్రోఫీ అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన భీమిలి జట్టుకు రూ.10 వేల నగదు, ట్రోఫీ, నాల్గో స్థానం గెలుపొందిన ఉక్కునగరం క్లబ్ జట్టుకు రూ.8 వేలు నగదు, ట్రోఫీ ప్రదానం చేశారు.

మహిళల విభాగంలో..

పోటీల్లో మహిళల నుంచి నాలుగు జట్లు పాల్గొనగా అందులో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న ఉక్కునగరం జట్టుకు, రెండో స్థానంలో నిలిచిన గాజువాక సీడీ అకాడమీ క్లబ్‌కు ట్రోఫీలు అందజేశారు. స్పోర్ట్స్ విభాగం ఇన్‌చార్జ్ సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, స్టీల్‌ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రావాడ శివ, దల్లి గోవింద, ఎస్. రమేష్‌కుమార్, జనసేన నాయకుడు విందుల వెంకటరమణ, జిల్లా సంఘం కార్యదర్శి జె.ఎ స్.వి. ప్రసాదరెడ్డి, ఉక్కునగరం కబడ్డీ కోచ్ కె. లక్ష్మణరావు పాల్గొని బహుమతులు అందజేశారు.

కృత్రిమ మేధస్సుతో ఊహలకందని పరిణామాలు

అగనంపూడి: కృత్రిమ మేధస్సు మనిషి గమనాన్ని, గమ్యాన్ని మార్చేస్తోందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బోధనా పద్ధతులు, విధానాలపై జగ్గరాజుపేటలోని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు ఆరో రోజుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఏఐ తో ఊహలకందని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. గోవా ఎన్ఐటీ డీన్ దామోదర్‌రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో ఏయూ సీఎస్ఈ విభాగం ఆచార్యులు వల్లీ కుమారి వాత్సాయిని, విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, ఐటీ విభాగం హెచ్‌వోడీ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి'

అగనంపూడి: అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధి కె.హనుమంతురావు కోరారు. అగనంపూడిలోని జీవీఎంసీ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు సాయి సరస్వతి, బొరమ్మ, విజయకుమారి, ఆదిలక్ష్మి, గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

అక్కిరెడ్డిపాలెం: నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు కృషి చేస్తున్నామని ఈఆర్వో లక్ష్మారెడ్డి అన్నారు. గాజువాక జోనల్ కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 6 నుంచి 11 మధ్య వచ్చిన అభ్యంతరాలకు సంబంధించి ఫారమ్ 9, 10, 11, 11ఏ, 11బీ లను సాఫ్ట్ కాపీ ద్వారా పంపించామన్నారు. డూప్లికేట్ ఎంట్రీలు తొలగించే విధానాన్ని పీపీటీ ద్వారా వివరించారు. బీఎల్‌ఓలు విచారణ చేసి, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల డిక్లరేషన్‌కు దరఖాస్తు చేయాలని తెలియజేశారు. జెడ్పీ సింహాచలం, ఏసీపీ శ్రీలక్ష్మి, పెదగంట్యాడ తహసీల్దార్ రమాదేవి పాల్గొన్నారు.